క్లుప్తంగా

ఘనంగా హనుమాన్ ఘనభిక్ష



దామెర : మండల కేంద్రంలో హనుమాన్ ఘన భిక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. పోల్సాని శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఆవరణలో స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చిత్రపటానికి వివిధ రకాల పూల తోపాటు తమలపాకులతో అలంకరించారు. గురుస్వాములు వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం పండ్లు, పంచామృతాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పాల్గొని టెంకాయలు సమర్పించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేసు నమోదు

ఆత్మకూరు : దామెర మండలం దుర్గంపేటకు చెందిన వెంకట్రాములు ఎంబీబీఎస్ డాక్టర్ అంటూ ప్రజలను మోసం చేసి చికిత్స చేస్తున్నాడని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ కరీముల్లా పేరు మీద లైసెన్స్ తీసుకొని నర్సింగ్‌హోమ్ నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా చేసినట్లు ఆయన వెల్లడించారు.

కదిలిన రెవెన్యూ అధికారులు

పరకాల : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పక్కన సర్వే నంబర్ 950లో 1500 గజాల ప్రభుత్వ భూమి (రూ.5కోట్ల విలువ) ఆక్రమణకు గురవుతుందని బీజేపీ నాయకులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజభద్రయ్య, నాయకులు మేఘనాథ్, రాజేందర్‌రెడ్డి, నిరంజన్, దేవేందర్ పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు



శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో గల ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో, మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ గంగాజమున తెలిపారు. శనివారం ప్రగతిసింగారం ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో మాట్లాడారు. జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పాలనశాస్త్ర విభాగానికి విరాళం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగానికి ఆ విభాగం స్కాలర్స్ భూక్య రమేష్, జీడీ.కనకయ్య, న్యాతాని సుధీర్‌కుమార్.. రూ.40వేల విలువ చేసే ఏసీ యంత్రాన్ని శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విభాగం అధిపతి పెదమళ్ల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం అభివృద్ధి చేయూతనందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ యాదగిరిరావు, కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ బుర్ర ఉమాశంకర్, డాక్టర్ మోహన్, స్కాలర్స్ పాల్గొన్నారు.

భక్తులను ఆకట్టుకున్న నృత్యాలు

కాజీపేట: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నృత్య కళాకారులు శనివారం ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ వ్యాఖ్యాత, రామాలయ ఇన్‌చార్జ్ శనిగరపు రాజ్‌మోహన్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. గోపిక టీమ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కళాకారులను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ సన్మానించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామార్చన, తులసీమాల సేవనం చేశారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర

వరంగల్: 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో హనుమాన్ మాలధారుల ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను శనివారం నిర్వహించారు.

పుస్తకాల కోసం జాగారం!

- డబ్బులివ్వకపోవడంతో పుస్తకాల్ని దింపేందుకు కూలీల నిరాకరణ
- సుమారు 24 గంటలు గడిచినా ఆరు బయటే పాఠ్యపుస్తకాలు
- రాత్రంతా పాఠ్యపుస్తకాల వద్ద ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పడిగాపులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఎమ్మార్సీ భవనం ఎదుట పాఠ్య పుస్తకాలు ఉన్న వాహనాలు

ఎల్కతుర్తి: 'హలో.. ఎంఈఓ సార్ పాఠ్యపుస్తకాలొచ్చాయి. వాహనాల్లో ఉన్న వాటిని దింపేందుకు కూలీలు డబ్బులడుగుతున్నారు. పుస్తకాలను దింపించమంటారా' అని ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది ఎంఈఓను ఫోన్‌లో అడగ్గా.. 'నేను మళ్లీ ఫోన్ చేస్తా' అని ఫోన్ కట్ చేశారు. తిరిగి సిబ్బంది ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. ఫోన్ ఎత్తలేదు ఎంఈఓ. దీంతో 24గంటలు గడిచినా పాఠ్యపుస్తకాలు ఆరు బయటనే ఉన్నాయి. చేసేది లేక కార్యాలయ సిబ్బంది రాత్రంతా ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట పడిగాపులు కాశారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. ఈ మేరకు 'సాక్షి' శనివారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. అక్కడున్న సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈవిద్యా సంవత్సరానికి గాను నూతన పాఠ్య పుస్తకాలు శుక్రవారం సాయంత్రం మండల విద్యావనరుల (ఎమ్మార్సీ) కార్యాలయానికి రెండు ప్రయివేటు (బస్సు) వాహనాల్లో వచ్చాయి. కాగా.. అందులో ఒక వాహనం కార్యాలయం వద్ద గుంతలో దిగబడింది. రెండు ప్రైవేట్ వాహనాల్లో ఉన్న పాఠ్య పుస్తకాలను కార్యాలయంలోకి షిఫ్టు చేసేందుకు సిబ్బంది కొందరు లేబర్లను పిలిపించారు. వచ్చిన కూలీలు ముందుగా డబ్బులిస్తేనే బస్సులో ఉన్న పాఠ్యపుస్తకాలు తీసి కార్యాలయంలోకి చేరుస్తామని చెప్పడంతో కార్యాలయ సిబ్బంది ఎంఈఓ రవీందర్‌కు ఫోన్ ద్వారా వివరించారు. దీంతో ఎంఈఓ మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పి కట్ చేసినట్లు సమాచారం. సిబ్బంది ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎంఈఓ ఫోన్ ఎత్తకపోవడంతో కార్యాలయ సిబ్బది చేసేది లేక రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు పాఠ్యపుస్తకాల వద్ద పడిగాపులు కాశారు. ఒక వేళ వర్షం కురిస్తే లక్షల రూపాయల విలువైన పాఠ్యపుస్తకాలు తడిసేవని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంఈఓపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. గతంలో ఎంఈఓపై వచ్చిన ఆరోపణలతో కొన్ని రోజులు సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. అయినప్పటికీ మార్పు రాలేదని, అదే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు.

నేను హాస్పిటల్‌లో ఉన్నా..

నేను డయాలసిస్ పేషెంట్‌ను. శుక్రవారం సాయంత్రం నుంచి హాస్పిటల్‌లో ఉన్నా. నిన్న మా సిబ్బంది ఫోన్ ద్వారా పాఠ్యపుస్తకాలొచ్చాయని చెప్పారు. కానీ.. నేను ఆస్పత్రిలో ఉన్నానని సమాధానం ఇచ్చా. ఈ రోజు మధ్యాహ్నం సిబ్బందితో మాట్లాడి వాహనాల్లో ఉన్న పాఠ్యపుస్తకాలను కార్యాలయంలోకి షిఫ్ట్ చేయించమని సిబ్బందికి సూచించా.

– రవీందర్, ఎంఈఓ, ఎల్కతుర్తి

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

- మామునూరు ఏసీపీ తిరుపతి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ

ఐనవోలు : నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. శనివారం మండలంలోని పున్నేలు క్రాస్ కూడలి, వరంగల్-ఖమ్మం రహదారి వద్ద ఐనవోలు పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్– ఖమ్మం రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుందన్నారు. అలాగే ఐనవోలు మల్లన్న ఆలయానికి నిత్యం అధిక సంఖ్యలో భక్తుల రాకపోకలు జరుగుతున్నందున వారి రక్షణ కోసం సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. సీసీ కెమెరాలు ఉంటే పోలీసులు నేరాలను సులభంగా ఛేదించవచ్చన్నారు. అలాగే ప్రతి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నిరంతరం భద్రత ఉంటుందన్నారు. పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై అనిల్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ' పనుల్లో వేగం పెంచాలి

- ఏపీడీ సుధీర్‌కుమార్



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ సుధీర్‌కుమార్

శాయంపేట : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో వేగం పెంచి నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ సుధీర్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రగతి సింగారంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను సుందరీకరించాలని అన్నారు. పనుల్లో జాప్యం చేయొద్దని ఆయన సూచించారు. ఏపీడీ వెంట ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, సీసీలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఓటు అడిగే హక్కులేదు



దామెర : మాట్లాడుతున్న శ్రీరాంరెడ్డి

దామెర : కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కులేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు కారణమైన బీఆర్‌ఎస్‌కు, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయని కాంగ్రెస్‌కు పట్టభద్రులు నమ్మే స్థితిలో లేరని అన్నారు. పదేళ్ల పాలనలో పట్టభద్రుల సమస్యల కోసం బీఆర్‌ఎస్ ఏ రోజు నోరు మెదుపలేదన్నారు. మీడియా పేరుతో దందాలు చేసి కోట్ల రూపాయలు కూడబెట్టుకున్న తీన్మార్ మల్లన్నను నమ్మొద్దని పట్టభద్రులను కోరారు. నిజాయితీగా ఉండే బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ కోకన్వీనర్ రతన్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరకాలలో..

మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 21వ వార్డు కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మొద్దని పట్టభద్రులను కోరారు.

పట్టభద్రుల సమస్యలపై పోరాడుతాం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



దామెర : మాట్లాడుతున్న ధర్మారెడ్డి

దామెర : పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి తాము పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండల సమన్వయ కమిటీ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమై మాట్లాడారు. ప్రజాసేవ కోసం ఉన్నతమైన ఉద్యోగాన్ని త్యాగంచేసి రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడు రాకేశ్ రెడ్డని అన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయలు చేస్తున్న తీన్మార్ మల్లన్న, ప్రజాసమస్యలు పట్టని ప్రేమేందర్ రెడ్డిలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పట్టభద్రులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ గరిగె కల్పన, పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మండల యూత్ అధ్యక్షుడు మెంతుల రాజు, సమన్వయ కమిటీ సభ్యులు దామెరుప్పుల శంకర్, దాడి మల్లయ్య, సోనబోయిన కిశోర్, కిరణ్, మంతుర్తి రాకేశ్, నేరెళ్ల కమలాకర్, పున్నం సంపత్, ఆలేటి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : వరంగల్, ఖమ్మం, నలగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగలు రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ శనివారం ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. రవీందర్, రవి, అమ్మ రవి, ములకనూరు చంద్రమౌళి, వేణు, శ్రీను పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మామిడి మారుతి తన కుమారుడు మహేష్ జ్ఞాపకార్థం శనివారం 20మంది వాలీబాల్ క్రీడాకారులకు టీషర్ట్స్ అందించారు. యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

- లైసెన్స్ కలిగినఉన్న దుకాణాల్లోనే కొనాలి
- గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేయొద్దు
- ఏఓలు అఫ్జల్‌పాషా, పద్మ, సీఐ మహేందర్, ఎస్సై వెంకటేశ్వర్లు
- రైతులకు అవగాహన సదస్సు



ఎల్కతుర్తి : వంగరలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు



ఎల్కతుర్తి : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అఫ్జల్‌పాషా

ఎల్కతుర్తి : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని ఏఓ అఫ్జల్‌పాషా సూచించారు. భీమదేవరపల్లి మండలం ధర్మారం, కొప్పూర్, కొత్తకొండ, చంటయ్యపల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు కొనేముందు విత్తనానికి సంబంధించిన బిల్లు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో, మండలాల్లో, జిల్లాల్లో కానీ లైసెన్స్ కలిగిఉన్న డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. పంట దిగుబడి వచ్చేవరకు, పంటకాలం ముగిసే వరకు బిల్లుతో పాటు ఖాళీ విత్తన ప్యాకెట్లు, సంచులను భద్రపరుచుకోవాలని సూచించారు. రైతులకు ఇచ్చిన బిల్లులో కంపెనీ పేరు, విత్తన రకం, లాట్ నంబర్‌తోపాటు రేటు కూడా రాయాలని డీలర్లకు సూచించినట్లు తెలిపారు. విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా చూసుకోవాలని వివరించారు. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలను తక్కువ, ఎక్కువ ధరకు విక్రయిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. అలాగే పక్క జిల్లా నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన విత్తనాలు, విడి విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. ఏఈఓలు ప్రశాంత్, నాగరాజు, బిందు, పంచాయతీకార్యదర్శులు ధర్మేందర్, రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, అనిల్‌నాయక్ రైతులు పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైతులకు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి విత్తనాలను కొనుగోలు చేయొద్దని అన్నారు. ఫర్టిలైజర్ షాపు యజమాని రసీదు ఇవ్వని పక్షంలో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఏఓ పద్మ

ధర్మసాగర్ : మండలంలోని విత్తనషాపు డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ పద్మ హెచ్చరించారు. నారాయణగిరి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. విత్తనాలు విక్రయించే సమయంలో రైతులకు తప్పకుండా బిల్లు ఇవ్వాలని, లాట్ నంబర్, కంపెనీ పేరును బిల్లులో, రిజిస్టర్‌లో పొందుపర్చుకోవాలని సూచించారు. అనంతరం సీఐ మహేందర్ మాట్లాడుతూ.. డీలర్లు బ్లాక్‌బోర్డుపై ఎప్పటికప్పుడు విత్తనాల వివరాలను నమోదు చేయాలని అన్నారు. అలాగే సీడ్ లాస్, సీడ్ యాక్టుల గురించి డీలర్లకు వివరించారు. ఎస్సై హరిత, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులో జాప్యం



ట్రాక్టర్‌లో పేరుపోయిన చెత్త



ద్విచక్ర వాహనాలపై చెత్త తరలిస్తున్న సిబ్బంది

- మైలారంలో రెండురోజులుగా చెత్త నిల్వ
- వెదజల్లుతున్న దుర్వాసన
- మూటలు కట్టి చెత్త తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

శాయంపేట : గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరు చేసి అందులో నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నిరుగారుతోంది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలకు అందించిన ట్రాక్టర్ మరమ్మతుతో మూలకు పడినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని మైలారంలో రెండు రోజులుగా చెత్తను సేకరించే ట్రాక్టర్ జాకి మరమ్మతుకు రావడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. అప్పటి నుంచి ట్రాక్టర్‌లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ట్రాక్టర్ మరమ్మతుకు రావడంతో గ్రామపంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది ప్రభుత్వ పాఠశాలలోని చెత్తను సంచుల్లో వేసి ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లి డంపింగ్ యార్డులో వేస్తున్నారు. అయితే పాఠశాల సమీపంలోని కాలనీవాసులు కల్వర్టు ప్రక్కన చెత్త వేయడంతో గ్రామపంచాయతీ సిబ్బంది అక్కడే తగులబెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాక్టర్ మరమ్మతు చేయించాలని, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులో వేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌ను వివరణ కోరగా.. శుక్రవారం ట్రాక్టర్ జాకీ మరమ్మతుకు వచ్చిందన్నారు. దీంతో ట్రాక్టర్లలో చెత్త పేరుకుపోయిందని, వెంటనే ట్రాక్టర్ జాకీ రిపేరు చేయించి చెత్త తరలింపునకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రోడ్డు ప్రక్కన చెత్తను వేస్తున్న కాలనీవాసులకు నోటీసులు జారీ చేస్తామమన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా అందరూ సహకరించాలని కోరారు.

కొండగట్టుకు బయలుదేరిన మాలధారులు



పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన 10 మంది హనుమాన్ మాలధారులు శనివారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. నాలుగైదు రోజులు పాదయాత్ర చేసి హనుమాన్ జయంతి నాటికి కొండగట్టుకు చేరుకోనున్నట్లు వారు తెలిపారు. పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ స్వాములకు కుటుంబ సభ్యులు మంగళహారతులు పట్టి ప్రత్యేక పూజల చేసి స్వాములను సాగనంపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



దామెర : ప్రచారం నిర్వహిస్తున్న రమణారెడ్డి

ఆత్మకూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటారన్నారు. నాయకులు కుక్కల రమేష్, శ్రీశైలం, కమలాకర్, మణికంఠ, పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బిల్లా రమణారెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. మండల ప్రధానకార్యదర్శి భిక్షపతి, నాయకులు అనిల్ రెడ్డి, శ్రీనివాస్, రజినీకర్, రాజు, మధు, రాజు, లింగయ్య, కరుణాకర్, రవి పాల్గొన్నారు.

ధర్మసాగర్ : వరంగల్, నలగొండ, ఖమ్మం పట్టభద్రుల ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు కొట్టె ప్రభాకర్, బట్టు మల్లయ్య కోరారు. ప్రజావ్యతిరేక పాలకులను నిలదీసే ప్రజాగొంతు తీన్మార్ మల్లన్న అన్నారు. అలాంటి వ్యక్తిని పెద్దల సభకు పంపించాలని కోరారు. ప్రతి పట్టభద్రుడు తీన్మార్ మల్లన్నకు ఓటువేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధికంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని, ఈక్రమంలో ఫీజుల నియంత్రణకు ఓ చట్టం తీసుకు రావాల్సిన అవసరం ఉందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి సూచించారు. హనుమకొండలోని రాంనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పలు విద్యార్థి, ప్రజా సంఘాల బాధ్యులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో 'ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం – ఆవశ్యకత' అనే అంశంపై ఆయన మాట్లాడారు. కొన్ని విద్యాసంస్థలు ప్రాథమిక స్థాయి విద్యకే లక్షల రూపాయల డొనేషన్లు తీసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యాసంవత్సరం 25శాతం నుంచి 30శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయని వాపోయారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏబీఎస్‌ఎఫ్, ఏఐడీఎస్‌ఓ, ఐద్వా సంఘం, బీఎస్‌ఎఫ్, గిరిజన సంఘం, ఏఐకేఎస్, సీఐటీయూ బాధ్యులు చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వాంకుడోతు వీరన్న, సాంబయ్య, దీప, జయశ్రీ, మర్రి మహేష్, మంద నరేష్, బొట్ల మనోహర్, శ్రావణ్, సత్యనారాయణ, శివ, రాజిరెడ్డి, సాయికుమార్, మాసాని ప్రదీప్, అరుణ్, పవన్, పృథ్వీరాజ్, సాయి కొబ్లర్, మంగీలాల్, రమేష్, అనూష, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరావాలి

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈనెల 30న జరగనున్న దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర మహాసభకు దళిత, బహుజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ నాలుగవ మహాసభ కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో వివక్షకు గురవుతున్న దళిత, పీడిత, అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి తరఫున ప్రశ్నించే ప్రజా గొంతుకగా దళిత బహుజన ఫ్రంట్ నిలుస్తోందని వివరించారు. అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన సిద్ధాంత పునాదిపై ప్రతిఒక్కరూ పనిచేస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

వలకు చిక్కిన 13 కిలోల చేప



చేపను చూపిస్తున్న మత్స్యకారులు

కమలాపూర్: కమలాపూర్ మండలం ఉప్పల్ చిన్న చెరువులో శనివారం మత్స్యకారులు చేపలు పడుతున్న క్రమంలో ఓ మత్స్యకారుడి వలకు 13 కిలోల బొచ్చె చేప చిక్కింది. ఈ చెరువులో ఇంత పెద్ద చేప దొరకడం ఇదే మొదటిసారి అని, 13 కిలోల పెద్ద చేపను సైతం విక్రయానికి చెరువు పట్టిన కాంట్రాక్టర్‌కే అప్పగించినట్లు మత్స్యకారులు తెలిపారు.